క్లుప్తంగా

నేడు కౌలు రైతుల గ్రామ సభలు

సత్తెనపల్లి: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు జారీ చేసేందుకు ఈ నెల 25న మూడు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు సోమవారం తెలిపారు. మండలంలోని పెదమక్కెన, గుడిపూడి, నందిగామ-1, నందిగామ-2 గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. సభలకు గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బంది హాజరవుతారన్నారు. కౌలు రైతులు హాజరై తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు.

నాగవరం ఇన్‌చార్జి సర్పంచ్‌గా రామాంజనేయులు

నాగవరం(క్రోసూరు): మండలంలోని నాగవరం గ్రామ ఉప సర్పంచ్ చిరంజి రామాంజనేయులు సోమవారం ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య తెలిపారు. గ్రామ సర్పంచ్ గోనుల ప్రభావతి వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉన్నందున ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు ఉప సర్పంచ్ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రతనరాజు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులుగా గ్రేడ్-5 కార్యదర్శులు

క్రోసూరు: మండలంలో గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-5 కార్యదర్శులుగా పనిచేస్తున్న ఐదుగురు కార్యదర్శులకు సోమవారం నుంచి పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించినట్లు పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య తెలిపారు. మండలంలోని గరికపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఎ.శేషగిరి, గాదెవారిపాలెం పంచాయతీ కార్యదర్శిగా ఒ.లక్ష్మీప్రసన్న, ఉయ్యందన పంచాయతీ కార్యదర్శిగా ఉమాశంకర్, విప్పర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఒ.ప్రకాశ్, బాలెమర్రు పంచాయతీ కార్యదర్శిగా ఎస్.హరికృష్ణ బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు గ్రేడ్-5 కార్యదర్శులకు త్వరలో పూర్తిస్థాయి కార్యదర్శుల బాధ్యతలు అప్పగించనున్నట్లు ఈవోపీఆర్డీ తెలిపారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఎంపీపీఎస్(ఎస్సీ) పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్టూడెంట్ కిట్స్ అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం ఐ.సామ్రాజ్యం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించే కిట్స్ సద్వినియోగపరుచుకుని మంచి చదువులు చదువుకోవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా క్రమం తప్పకుండా బడికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సదాశివారెడ్డి, టి.ప్రకాశరావు, గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, గోపి, గ్రామపెద్దలు చంద్రశేఖరరావు, సైదా, చెత్తు బుడే, మొగల్‌జాన్, విష్ణుమూర్తి, కె.సుబ్బారావు, చిన శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు ప్రయోజనం

నకరికల్లు: కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొంది రాయితీలు పొందాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని చీమలమర్రి గ్రామ రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 నెలల కాలపరిమితితో ఇచ్చే సీసీఆర్‌సీ కార్డుల ద్వారా రాయితీపై విత్తనాలు, పంట బీమా సదుపాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో రమణారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు జి.జగదీష్, పెమ్మసాని వీరయ్య, నలగట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం



రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామ వ్యవసాయ సహాయకులుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అకాల మరణం పొందిన గొట్టం లక్ష్మారెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ రైతు సంఘం అధ్యక్షులు కేవీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మిట్టగుడిపాడు గ్రామంలోని లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని అన్నారు. లక్ష్మారెడ్డి కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించే విషయంలో చొరవ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల కోశాధికారి గిద్దల ఆంజనేయులు, ఉద్యాన సహాయకులు డి.శంకర్, ఎం.పవన్, వ్యవసాయ సహాయకులు గొంటు కృష్ణారెడ్డి, ప్రసన్న, జగన్, సతీష్ తదితరులున్నారు.

ఘాటెక్కుతున్న ఉల్లి

- దిగుబడి తగ్గుదల
- ప్రస్తుతం కిలో ఉల్లి ధర రూ.40
- మరింత పెరగనున్న ఉల్లి ధరలు
- కొనాలంటే కన్నీళ్లు తప్పవంటున్న వినియోగదారులు

ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదంటారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి నుంచి ఆ మేలు పొందే సంగతి అటుంచితే దాని మాట ఎత్తాలంటేనే భయమేస్తుంది. ఇందుకు కారణం ధరలు. పెరుగుతున్న ధరలతో కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.



విక్రయానికి దుకాణంలో సిద్ధంగా ఉన్న ఉల్లిపాయలు

సత్తెనపల్లి: ఉల్లిపాయల ధరలకు రెక్కలొచ్చాయి. మే నెలలో రూ.20 ఉన్న ధర జూన్‌లో రెట్టింపై రూ.40కి చేరింది. పూణే, ఢిల్లీ, హైదరాబాద్, కర్నూల్ నుంచి జిల్లాలోని మార్కెట్లకు ఉల్లిపాయలు (ఎర్రగడ్డలు) వస్తున్నాయి. జిల్లాలో తగినంత నిల్వలు లేకపోవడం, సరఫరా మందగించడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. దేశంలో ఉల్లిని ఉత్పత్తి చేసే అగ్రగామి రాష్ట్రమైన మహారాష్ట్రలో కరువు పరిస్థితుల కారణంగా ఉత్పత్తి లోటు ఉంది. దీంతో దేశంలో గత రెండు వారాల్లో ఉల్లి ధరలు 30 నుంచి 50 శాతం పెరిగాయి. ఈ క్రమంలోనే కొందరు వ్యాపారులు సరుకు నిల్వ చేసి ధరలు మరింతగా పెరిగేలా చేస్తున్నారనే ఆరోపణలు మార్కెట్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది.

నెల రోజుల వ్యవధిలో పెరిగిన ధరలు

ధరల విషయానికి వస్తే రిటైల్ ధర సుమారు 25 శాతం, హోల్‌సేల్ ధర 15 శాతం పెరిగింది. ఏడాది క్రితం ఉల్లి రీటైల్ ధర కిలో రూ.20 ఉండగా, హోల్‌సేల్ క్వింటాలకు రూ.1,581.97గా ఉంది. ప్రస్తుతం రిటైల్ ధర కిలో రూ.40 నుంచి రూ.45 మధ్య ఉంది. నెల క్రితం కిలో ధర రూ.20 వరకు ఉంది. నెల రోజుల వ్యవధిలో ఉల్లి ధరలు రెట్టింపయ్యాయి.

కొత్త పంట చేతికి వచ్చే అవకాశాల్లేవు

మరోవైపు సెప్టెంబర్, అక్టోబర్ వరకు కొత్త ఖరీఫ్ పంట చేతికొచ్చే అవకాశం లేకపోవడంతో ఉల్లి కిలో రూ.60 దాటొచ్చని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. దేశంలో 42 శాతం మేర ఉల్లి ఉత్పత్తి జరిగే మహారాష్ట్రలో తీవ్రమైన కరువు పరిస్థితుల కారణంగా ఈ ఉత్పత్తి 15 నుంచి 20 శాతం తగ్గుదల చవిచూసింది. మహారాష్ట్రలోని 27 జిల్లాలు 20 నుంచి 40 శాతం వరకు లోటు వర్షపాతాన్ని ఎదుర్కొన్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి.

✦ ఢిల్లీ ఉత్పత్తి పడిపోయిన క్రమంలో రానున్న రోజుల్లో కిలో ధర రూ.120 నుంచి రూ.150 కి చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో అవసరమైన అంత ఉత్పత్తి మార్కెట్‌కు రావడం లేదు. దీంతో ధర పైకి ఎగబాకుతోంది. కొత్త పంట మార్కెట్లోకి వచ్చే వరకు మరికొన్ని రోజులు ఉల్లి కొరత కొనసాగుతుందని రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈవో బాల సుందరరావు

బెల్లంకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో బాలసుందరరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బడి బయట విద్యార్థులు, నూతన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాలలో 1, 2 తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బెల్ట్, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, టీడీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు పీఎస్కే మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ప్రతి సదుపాయం ఉపయోగించుకుని ప్రతి విద్యార్థి మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంషాద్ బేగం, వైస్ సర్పంచ్ జానీ, మల్లారెడ్డి, సీఆర్పీ నరసింహారావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లంకొండలో విద్యార్థికి కిట్ అందిస్తున్న ఎంఈవో, నాయకులు

వైభవంగా ముత్యాలమ్మ జాతర

తుమ్మకోట(రెంటచింతల): మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఇంద్రపల్లి ముత్యాలమ్మ జాతర మహోత్సవ వేడుకలు సోమవారం ఆలయ అర్చకులు సాయికృష్ణ నేతృత్వంలో ఎంతో వైభంగా కొనసాగుతున్నాయి. గ్రామ దేవత ఇంద్రపల్లి అమ్మవారికి పూర్వం నుంచి ఒక ఆచారంగా రెండు సంవత్సరాలకు ఒకసారి ముత్యాలమ్మ జాతరకు కులమతాలకు అతీతంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు తమ తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేసి అలంకరించారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడానికి ఎస్ఐ ఎం.ఆంజనేయులు తన సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

అర్హులందరికీ సాగుదారు హక్కు పత్రాలు

తహసీల్దార్ ప్రసాద్

బెల్లంకొండ: భూ యజమానుల హక్కులకు భంగం కలుగకుండా పంట సాగుదారు హక్కు పత్రాలు అర్హులైన రైతులందరికీ జారీ చేయబడతాయని తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని మాచాయపాలెం, పాపాయపాలెం గ్రామాలలో పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ యజమానులు పంట సాగుచేయు సాగుదారులకు సహకరించాలని సూచించారు. వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామంలో కౌలుకు సాగు చేయు రైతులందరు తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రం తీసుకోవాలని అందుకు గాను భూ యజమాని ఆధార్, సాగుదారు ఆధార్, మొబైల్ నంబర్‌తో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీసీఆర్‌సీ కార్డుల ద్వారా పంట నమోదు తద్వారా పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు పొందుటకు, పంట బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టాలు సంభవిస్తే పంట నష్ట పరిహారం, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలు పొందుటకు ఈ హక్కు పత్రాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామన బోయిన ఆదిగోపాలరావు, రెవెన్యూ సిబ్బంది పవన్ కుమార్, శాస్త్రి, శ్రీనివాసరావు, గ్రామ ఉద్యాన సహాయకురాలు ఉల్లంగుంట ప్రత్యూష, మాటూరి వంశీ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



పాపాయపాలెంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

శ్రీనివాసరావు కుటుంబానికి ఆర్థిక సహాయం



మాచర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ పాత్రికేయుడు దొడ్డా శ్రీనివాసరావు కుటుంబాన్ని జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు, టీడీపీ నాయకులు సోమవారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆరు నెలలకు సరిపడా సరుకులు, రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణంలోని 24వ వార్డులో నివాసం ఉండే డి.శ్రీనివాసరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శ్రీనివాసరావు కుటుంబానికి టీడీపీ నాయకులు కంభంపాటి అనిల్‌కుమార్, గాయత్రి పెయింటర్స్ కాశిరెడ్డిల సహకారంతో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామమూర్తి, నాయకులు గణేష్, ఓరుగంటి చెన్నకేశవరావు, ఎం.రాంబాబు ఆధ్వర్యంలో సహాయం అందజేశారు.

విత్తనాల షాపులలో విస్తృతంగా తనిఖీలు

రెంటచింతల: విత్తనాలు విక్రయించే షాపుల నిర్వాహకులు అనుమతులు లేని విత్తనాలను రైతులకు విక్రయిస్తే విత్తన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక విత్తనాల షాపులలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మాట్లాడారు. లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. విత్తనాల షాపుల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు ప్రతి ఏడాది తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి (లైసెన్స్) తీసుకోవాలని సూచించారు. అలాగే అనుమతులు (ప్రభుత్వ గుర్తింపు పొందని కంపెనీల) లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఎంఆర్పీ (ప్రభుత్వం నిర్ణయించిన) ధరలకే విక్రయించాలన్నారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లయితే అటువంటి షాపుల నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని ఆ షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అనుమతులు తీసుకోకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన విత్తనాలను ఈ ప్రాంతంలో అమ్మడం నేరమన్నారు. రైతులకు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి కచ్చితంగా బిల్లులు పూర్తి వివరాలతో ఇవ్వాలన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో బ్రహ్మారెడ్డి

ఘనంగా కాశీవిశ్వనాథం స్వామీజీ జన్మదిన వేడుకలు



మాచర్ల: పట్టణంలో పరబ్రహ్మ కాశీవిశ్వనాథం స్వామీజీ జన్మదినోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మానుకొండ కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు అనేక మంది పాల్గొని స్వామి అనుగ్రహాన్ని పొందారు. పరబ్రహ్మ కాశీవిశ్వనాథం స్వామి అనుగ్రహ భాషణ చేశారు. పలువురు స్వామీజీలు, మాతాజీలు, పీఠాధిపతులు పాల్గొన్నారు. గురుస్వామి పందిరి శ్రీశైలం మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గం గుల్లపాడు గ్రామం నుంచి భక్తులు స్వామీజీకి పలు సేవలు అందించారన్నారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

228 మందికి క్షయవ్యాధి నివారణ వ్యాక్సిన్

మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో క్షయవ్యాధి (టీబీ) నివారణకు 228 మందికి వ్యాక్సిన్ వేసినట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 11 గ్రామాలలో నున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాలలో 60 సంవత్సరాల పైబడిన వారికి, పొగ తాగే వారికి, షుగర్ ఉన్నవారికి, 5 సంవత్సరాల కిందట క్షయ(టీబీ) ఉన్న వారికి.. వారి కుటుంబ సభ్యులకు ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. క్షయ వ్యాధి ఒక అంటువ్యాధి అని ఈ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిదన్నారు. ఇది ఊపిరితిత్తులకు సంబంధించినది అయినప్పటికీ చర్మము నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. క్షయవ్యాధి ఉన్న వ్యక్తి దగ్గు, తుమ్ము నుంచి వచ్చే చిన్న చిన్న తుంపర్ల ద్వారా ఈ వ్యాధి సోకుతుందని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



టీబీ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల ప్రకారం హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు కచ్చితంగా ఈకేవైసీ, సేఫ్టీ చెకప్ చేయించుకోవాలని వినుకొండ హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సయ్యద్ సలీం తెలిపారు. 5 సంవత్సరాల పైబడి కాలం చెల్లిన సురక్ష పైపులను ఏజెన్సీ సిబ్బంది వద్ద మార్చుకోవాలని సూచించారు. ఈకేవైసీకి రుసుము చెల్లించాల్సిన అవసరంలేదని, సురక్ష పైపుకు రూ.190 చెల్లించాలన్నారు.

విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



నకరికల్లు: విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు ఎం.బి.రత్న కుమారి అన్నారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పురవీధుల్లో విద్యార్థులు విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. బడి మానేసిన 14 ఏళ్లలోపు పిల్లలను వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జి.కన్నారావు, ఉపాధ్యాయులు ఎస్.మల్లిఖార్జునరావు, జి.బాల స్వామి, ఎం.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో 'నేను బడికి పోతా' ర్యాలీ



దమ్మాలపాడులో జాయినింగ్ లెటర్ అందిస్తున్న ఉపాధ్యాయులు



లేమల్లెలో నేను బడికి పోతా ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అమరావతి: మండల పరిధిలోని గ్రామాలలో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించటానికి అలాగే ప్రైవేటు స్కూళ్లలో చేర్చకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించటానికి విద్యా శాఖ ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎంఈవో-2 సీహెచ్ శివబాబు మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామాలలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామాలలో బడి ఈడు పిల్లలు ఉన్న తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు స్వయంగా మాట్లాడి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాలను వివరించి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరుతున్నారన్నారు. ఇప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలతో కూడిన కిట్స్ పంపిణీ చేశామన్నారు. కిట్‌లో బూట్లు పంపిణీ జరగలేదని అలాగే 7వ తరగతి పుస్తకాలు ఇంకా అందుబాటులోకి రాలేదన్నారు. త్వరలో పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

దమ్మాలపాడులో 'నేను బడికి పోతా'

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామ రామాపురం కాలనీలో ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోకల అచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొని తల్లిదండ్రులను కలిసి విద్యార్థులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వివరించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలున్న ఉపాధ్యాయులు బోధన చేస్తారని వివరించారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా వారందరికీ అమ్మ ఒడి వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో 20 మంది పిల్లలకు జాయినింగ్ లెటర్‌లను వారి తల్లిదండ్రులకు అందించారు. ఉపాధ్యాయులు ముప్పా సురేష్, టి.వేణుమాధవి, సతీష్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు చాలా ఉపయోగం

రాజుపాలెం: రుణ అర్హత కార్డులు(సీసీఆర్‌సీ) కౌలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని వ్యవసాయాధికారి వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని అనుపాలెం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్డులు 11 నెలలు మాత్రమే ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్డుల ద్వారా పంట నమోదు చేయించుకోవచ్చని, పండిన పంటను వ్యవసాయ మార్కెట్‌ల ద్వారా విక్రయించుకోవచ్చని తెలిపారు. రైతులకు ఇన్సురెన్సు, బ్యాంక్‌ల ద్వారా రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. కౌలు చేసే రైతులు ప్రతి ఒక్కరు సీసీఆర్‌సీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరిశీలించి వెంటనే కార్డులు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అనుపాలెం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన సమావేశం

హక్కుల సాధనకు కార్మికులు పోరాటాలు నిర్వహించాలి

ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ గద్దె చలమయ్య

సత్తెనపల్లి: ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారని, తమ హక్కుల సాధనకై కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని ఏఎంసీ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ యార్డు ముఠా వర్కర్స్ యూనియన్ 15వ మహాసభ సోమవారం జరిగింది. ఈ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు తమ పనిని శ్రద్ధగా చేసే విధంగా క్రమశిక్షణతో కూడిన పని విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వం కార్మికులకు ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేయటం లేదని, గుర్తింపు కార్డులను ఇవ్వటం లేదన్నారు. కార్మికులు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలను ఆదుకునే విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కూలి రేట్లు కూడా పెరిగిన ధరలకు అనుకూలంగా పెంచాలన్నారు. సభకు యూనియన్ అధ్యక్షుడు అమృతలూరి డేవిడ్‌రాజు అధ్యక్షత వహించారు. సభలో పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు, సీఐటీయూ పట్టణ సహాయ కార్యదర్శి జె.రాజ్ కుమార్‌లు మాట్లాడారు. మహాసభ నూతన కమిటీ ఎన్నికల్లో భాగంగా గౌరవ అధ్యక్షులుగా జడ రాజ్‌కుమార్, నూతన అధ్యక్షుడిగా గుజ్జర్లపూడి ప్రభుదాసు, ప్రధాన కార్యదర్శిగా చింతపల్లి రమేష్, వైస్ ప్రెసిడెంట్‌గా అమృతలూరి డేవిడ్ రాజు, సహాయ కార్యదర్శిగా బిద్దెపూడి ముక్కంటి, ట్రెజరర్‌గా నల్లబోతుల శ్రీను, కమిటీ సభ్యులుగా గుజ్జర్లపూడి ప్రసాద్, మల్లా వెంకయ్య, బిద్దెపూడి మోషే, గుజ్జర్లపూడి కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. సభలో ముఠా కార్మికులు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గద్దె చలమయ్య

రెంటచింతలలో వైద్య శిబిరం ఏర్పాటు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని వడ్డెర బావి సెంటర్‌లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇంటింటి డయేరియా కేసుల సర్వే చేపట్టినట్లు గోలి వైద్యాధికారి కె.ప్రదీప్‌కుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఆదేశాల మేరకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టి, ఇతర కేసులు ఉంటే గుర్తించి వివరాలు గూగుల్ షీట్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కలుషితమైన నీటిని తాగడం వలన డయేరియా(అతిసార) వస్తుందని, సీజనల్ వ్యాధుల గురించి కాలనీ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. డయేరియా వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందాలని కోరారు. గ్రామంలో అతిసార వ్యాధి వచ్చిన ప్రాంతాలలో గ్రామ పంచాయతీ పారిశుధ్య పనులను చేపట్టి, సైడ్ కాల్వల్లో నున్న మంచినీటి పైపులను సైడ్ కాల్వల పైభాగాన ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయాలని ఎంపీడీవో, కార్యదర్శులకు సూచించడం జరిగిందన్నారు. మినరల్ వాటర్ తాగమని, పంచాయతీ ట్యాప్ వాటర్‌ను కాచుకుని తాగడం వలన డయేరియా దరి చేరదన్నారు. డయేరియా వచ్చిన ప్రాంతాలలో తాగునీటి నాణ్యత పరీక్ష చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మెడికల్ క్యాంప్‌లో వైద్య సేవలు అందిస్తున్న గోలి వైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌రెడ్డి

డిమాండుకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయాలి

కారెంపూడి: మండలానికి వచ్చిన పచ్చి రొట్ట విత్తనాలు వచ్చిన రోజునే అయిపోయాయి. రెండు క్వింటాళ్లు మాత్రమే గ్రామానికి రావడంతో ఎదరు చూస్తున్న రైతులు వెంటనే వాటిని తీసుకెళ్లారు. మండలంలో ఒప్పిచర్ల, నరమాలపాడు, గాదెవారిపల్లె, పెదకొదమగుండ్ల ఆర్బీకేలకు వచ్చిన విత్తనాలను రైతులు వెంటనే తీసుకెళ్లారు. కావాల్సిన రైతులు మళ్లీ విత్తనాలు ఎప్పుడు వస్తాయని అడుగుతున్నారు. మిగిలిన 11 గ్రామాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. తొలకరిలో మాగాణి భూముల్లో భూసారం పెంచుకోవడం కోసం పచ్చిరొట్ట పైర్లు సాగుచేయడం ఆనవాయితీగా వస్తోంది. వాస్తవానికి మే 15వ తేదీ నాటికే విత్తనాలు రావడం జరిగేది. కానీ సార్వత్రిక ఎన్నికలు, అనంతరం తలెత్తిన ఘటనల నేపథ్యంలో చాలా కాలం కొనసాగిన 144 సెక్షన్ కారణంగా పచ్చిరొట్ట విత్తనాల ఇండెంట్‌లను వ్యవసాయ శాఖ అధికారులు లేటుగా పెట్టారని తెలుస్తోంది. వాస్తవానికి ఒక్కో ఆర్బీకేకు మూడు టన్నుల పచ్చిరొట్ట విత్తనాలు అవసరం కాగా ఇప్పటికి రెండు క్వింటాళ్లు చొప్పున మాత్రమే రావడం వల్ల కొరత ఏర్పడింది. రైతులు వాటి కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి. డిమాండుకు తగినట్టు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.